www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబర్ 2025
5
అన్నమయ్య

ఊర్లకు వెళ్లేవారు సమాచారం ఇవ్వాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్వగ్రామానికి లేదా బంధువుల ఇళ్లకు వెళ్ళినప్పుడు సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. శనివారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పండగల సందర్భంగా కుటుంబం బంధువులతో గడిపే మధురమైన సమయమని పేర్కొన్నారు. ఆ సమయంలో నిర్లక్ష్యం చేస్తే దొంగలు అవకాశాన్ని చేజిక్కించుకునే ప్రమాదం ఉందన్నారు. ఎవరూ లేని ఇళ్లే దొంగలకు టార్గెట్ అని అజాగ్రత్త వహిస్తే పెద్ద నష్టానికి కారణం అవుతుందని సూచించారు. ప్రతి ఇంట్లో సిసి కెమెరాలు, అలారం సిస్టం సెన్సార్ లైట్ అమర్చాలని చెప్పారు. విలువైన వస్తువులు ఇంట్లో వదిలి వెళ్లకూడదని, తప్పనిసరిగా బ్యాంక్ లాకర్‌లో ఉంచాలని తెలిపారు. ఊరికి వెళ్ళే న్న బంధువుల దగ్గరికి వెళ్తున్న సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

400 వస్తువుల ధరలపై జిఎస్‌టి తగ్గింపు

- వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుమయ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

జిఎస్‌టి తగ్గింపుతో 400 వస్తువుల ధరలు తగ్గుతాయని, ఏయే వస్తువులు రేట్లు తగ్గుతాయనే అంశంపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ షేక్ సుమయ అన్నారు. శనివారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మహిళా సమాఖ్యల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు సూపం జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి జిఎస్‌టి 5 లేదా 18 శాతం స్లాబ్ లలో మాత్రమే అందు బాటులో ఉంటుందన్నారు. వస్తువులపై జిఎస్‌టి తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లబ్ధిచేకూరుతుందన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రతి మహిళకూ ఏ వస్తువుపై జిఎస్‌టి తగ్గింపు వర్తిస్తుందనే అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. విస్తృత ప్రచారం జరిగి అందరికీ అవగాహన ఏర్పడినప్పుడే జిఎస్‌టి తగ్గింపు లబ్ధిని సద్వినియోగం చేసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాణిజ్య, పన్నుల శాఖ సిబ్బంది, మెప్మా ఐబిటి నాగరాజు, పట్టణాధికారి అబ్బాస్ అలీఖాన్, రిసోర్స్ పర్సన్లు సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ జిఎస్‌టి'ని విజయవంతం చేద్దాం : డిఎంహెచ్‌ఒ

అక్టోబర్ 19 వరకు నిర్వహిస్తున్న సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య పిలుపు నిచ్చారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో సాధారణ మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్న జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కార్యక్రమం చేపడుతామన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు జిఎస్‌టి ఫలాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. 30 నుంచి అక్టోబర్ 6 వరకు వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధి హామీ శాఖల వారికి అవగాహన కార్యక్రమం, 7 నుండి 13 వరకు మానవ వనరులు, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి సాధికారతపై అవ గాహన కార్యక్రమం ఉంటుందన్నారు. 14 నుండి 18 వరకు వికాస్ విశ్వాస నమ్మకమైన అభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సమావేశాలు, సెమినార్లు, వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. 19న జిల్లా, మండల స్థాయి లో సామూహిక దీపావళి సంబరాలు నిర్వహిస్తామన్నారు. జిఎస్‌టి తగ్గింపు వల్ల ఆరోగ్యశాఖకు సంబంధించిన కొన్ని రకాల కేన్సర్ మందులపై 12 ఉన్న జిఎస్‌టని పూర్తిగా రద్దు చేస్తామని తెలిపారు. డయాగ్నొస్టిక్ కిట్స్‌పై 12 నుండి 5 శాతానికి తగ్గిం చడం, సర్జికల్ గూడ్స్‌పై 18 నుంచి 12 శాతానికి, లైఫ్ స్టైల్ మార్పుకు వినియోగించే క్రీడా పరికరాలపై 12 శాతం నుండి 5 శాతం వరకు, ఆలోచన శక్తిని పెంచే ఇండోర్ గేమ్ గూడ్స్ పై 12 నుండి 5 శాతం వరకు జిఎస్‌టి తగ్గిస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రజారోగ్యానికి దోహదం చేసే జిఎస్‌టి 2.0 ద్వారా లబ్ధి పొంది పొదుపు చేసుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. స్వదేశీ ఉత్పత్తు లను మాత్రమే కొనుగోలు చేద్దామని పిలుపు నిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ ఎసి సుమయ

కార్పొరేట్ల కోసమే మోడీ ప్రభుత్వం

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - బద్వేలు

భారతదేశంలో హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని, కార్పొరేట్ శక్తులను బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి పెంచి పోషిస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు అన్నారు. వైఎస్‌ఆర్ కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశమ్యాలను పెంచి పోషిస్తుందని, మతాల మధ్య అగ్గి రాజేస్తూ వాటి మధ్యలో కూర్చొని చలికాచుకుంటుందని వారు విమర్శించారు. దేశంలో లౌకికవాదాన్ని మంట కలుపుతూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను దారిమళ్లిస్తూ నియంతలాగా దేశాన్ని మోడీ పరిపాలిస్తున్నారని వాపోయారు. దీనికి రాష్ట్రంలోని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తోడు కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ఆదాని అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ భారతదేశ సంస్థలన్నింటినీ వారికి తాకట్టు పెడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందని విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు పేరుతో వందల మంది ప్రాణాలను బలికొన్న చరిత్ర ఎన్‌డిఎ కూటమిదని, జిఎస్‌టి పేరుతో సంవత్సరాల పాటు ప్రజలను దోచుకున్నారని చెప్పారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో కొంతమేర జిఎస్‌టిని తగ్గిస్తూ దేశ ప్రజల కోసం పనిచేస్తున్నట్లు ఫోజులు కొట్టడం మోడీ ప్రభుత్వానికి మాత్రమే చెల్లిందన్నారు. కార్పొరేటు వ్యక్తులకు సంస్థలకు రూ.లక్షల కోట్ల రాయితీలిస్తూ దేశ ప్రజల మీదమోయలేని భారాలు మోపిందన్నారు. అమెరికా అధ్యక్షులు మన దేశ అంతర్గత విషయాల్లో పెత్తనం చేస్తూ ఉంటే నోరు ఎత్తడం చేతకాని ప్రభుత్వమని చెప్పారు. మోడీ ఓ పక్క మతోన్మాదాన్ని మరోపక్క కార్పొరేట్ వ్యక్తులను అడ్డుపెట్టుకొని దేశంలో పరిపాలన సాగిస్తున్నారని, ప్రజల చైతన్యం ముందు ఇవి ఎప్పుడైనా బద్దలు కాక తప్పదని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, చిన్ని, శివ, నాగేంద్ర బాబు, సుబ్బారాయడు, మురప్రసాద్, పోరుమామిళ్ళ, బద్వేలు రూరల్, అట్లూరు, గోపవరం, మండల కార్యదర్శులు భైరవ ప్రసాద్, డి.వెంకటేష్, రమణయ్య, నరసింహ, నాయకులు లావణ్య, జయరాజ్, సరోజమ్మ, యానాదయ్య, దుర్గమ్మ, స్వప్న, చంద్ర, సరస్వతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డిఎస్‌పి

ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. శనివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయ ఆవరణలో మదనపల్లె పట్టణంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లిలో ఆటో డ్రైవర్లు కొందరు నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఆటోలు నిర్వహిస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ప్రతి ఆటోకి తప్పనిసరిగా రికార్డులు ఉండాలని, అవి ఆటోలోనే ఉండాలని పేర్కొన్నారు. లైసెన్స్ తప్పనిసరని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా దూరడం వంటివి చేయకూడదని తెలిపారు. ఎక్కడపడితే అక్కడ ప్యాసింజర్లను చూడగానే ఆపేయడం వలన తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఓ పద్ధతి ప్రకారం నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఆటోను నిలపాలని, ప్యాసింజర్లతో మర్యాద కరంగా నడుచుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కానీ, ఎంవిఐ అధికారులు కానీ రికార్డులు అడిగినప్పుడు చూపించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరు యూనిఫామ్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ తగదని, పరిమితికి మించి ప్యాసింజర్లను ఆటోలో కూర్చోబెట్టకూడదని, లౌడ్ స్పీకర్లు పెట్టకూడదని వివరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి'

సిఎం, డిసిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, పీలేరు ఎమ్మెల్యేల చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పీలేరు నాలుగు రోడ్ల కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్‌సి నిర్వహించి, కేవలం 150 రోజుల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతా పూర్వకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉపాధ్యాయ నాయకులకులు చెప్పారు. ఈ సందర్భంగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులురెడ్డి రమేష్ మాట్లాడుతూ గతంలో ఐదు సంవత్సరాల కాలం పాటు నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురుచూసారని, గత ప్రభుత్వం ఒక డిఎస్‌సి కూడా నిర్వహించలేదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గొప్పతనమన్నారు. ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి సూపర్ సిక్స్‌లో భాగంగా మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేయడం చాలా సంతోషకరమని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కేవలం 150 రోజుల్లోనే డిఎస్‌సి ప్రక్రియను పూర్తి చేయడం ఆనందదాయకమని తెలిపారు. నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగస్తులు అందరూ కూడా డిఎలు, పిఆర్‌సి కోసం చాలా కాలం నుంచి ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించాలని, ఆ కమిటీ నివేదిక ఇచ్చేలోగా మధ్యంతర భృతిని ప్రకటించాలని, దసరా, దీపావళి పండుగలను ఉద్యోగస్తులు చాలా ఆనందంగా చేసుకునే విధంగా తమకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, అమర్నాథ్, మస్తాన్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం ధర్మయ్య, శివశంకర్, జనార్దన్ రెడ్డి, జయరాం, వేణుగోపాల్, కిరణ్, ఎంఆర్‌పిఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి: విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ డాక్టర్ మహేష్ పవన్ సాతవల్లి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం ఎంబిఎ విద్యార్థుల కెరియర్ గైడెన్స్ కోసం ప్రత్యేక ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ మహేష్ పవన్ సాతవల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిఎ విద్య అనేది కేవలం ఒక డిగ్రీ కాదు, అది భవిష్యత్తుకు మార్గదర్శకమన్నారు. మేనేజ్మెంట్ కోర్సు ద్వారా లీడర్‌షిప్, సమస్యల పరిష్కారం, వ్యాపార అవగాహన, టీమ్ వర్క్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తు కెరీర్‌లో విజయానికి ఇవి కీలకమన్నారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఇండక్షన్ ప్రోగ్రాం లక్ష్యం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారిని కోర్సు నిర్మాణం, అకడమిక్ షెడ్యూల్, ఇంటర్న్‌షిప్స్, పరిశ్రమ అవకాశాలపై అవగాహన కల్పించడం, విద్యార్థులు క్లాస్‌రూమ్ లెర్నింగ్‌తో పాటు ప్రాక్టికల్ అనుభవం పొందాలని సూచించారు. ఎంబిఎ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్ మాట్లాడుతూ నేటి మేనేజ్మెంట్ విద్యార్థులు కేవలం పుస్తకాల చదువుతో ఆగిపోకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్, డిజిటల్ టూల్స్ వాడకం, ఆంత్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కళాశాల తరపున వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇండస్ట్రియల్ విజిట్స్, లైవ్ ప్రాజెక్టులు అందుబాటులో ఉంటాయని వివరించారు. సీనియర్ ప్రొఫెసర్లు విద్యార్థులను ప్రేరేపిస్తూ, మేనేజ్మెంట్ కోర్సును కేవలం ఉద్యోగం కోసం కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, స్టార్టప్ ఐడియాస్, కొత్త ఆవిష్కరణలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-పీలేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక రంగంలో ముందుకు వెళ్లాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ ప్రదీప్ తెలిపారు. శనివారం పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మైభారత్ కడప, షీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. కళాశాల చైర్మన్ అవినాష్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎన్.రావు మాట్లాడుతూ చక్కటి ఉద్యోగ అవకాశాలు పొందేలా తమ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు మై భారత్, షీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. షీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి.వి.ఎస్.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక అవకాశాలను యువత గుర్తించి, వాటిని వినియోగించుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల వైపే కాక స్టార్టప్ కార్యక్రమాలపై అవగాహన పెంచుకొని ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర పరిశ్రమలను స్థాపించే దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో షీ సంస్థ న్యాయ సలహాదారులు సుధాకర్, ఎంజెఆర్ కళాశాల అధ్యాపక బృందం, ఎంబిఎ, బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'చింతల'కు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు: పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డిని వైసిపి శ్రేణులు కలసి అభినందనలు తెలిపారు. శనివారం వారు చింతలను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చింతల రామచంద్రారెడ్డి వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమితులైనందుకు శుభాకాంక్షలు చెప్పారు. వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో మాజీ ఎమ్మెల్యేతో కలిసి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు దండు జగన్మోహన్ రెడ్డి, యువ నాయకులు లోకనాథ్ రెడ్డి, విక్టరీ వెంకట్రామారెడ్డి, జాకీర్, నాగరాజ నాయక్, రెడ్డప్ప, సివి రావు. చిన్న బాబు, సీకే వెంకటేశ్వర, నాగరాజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వేగంగా స్పందించాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: అధికారులు ప్రజా సమస్యలపై వేగంగా స్పందించాలని, కూటమి కార్యకర్తలకు గౌరవం ఇస్తూ గ్రామాలలో అధికారులు, నాయకులు కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు అధికారులకు సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా తహశీల్దార్ పీర్‌మున్నిసా, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది చమర్తికి పుష్పగుచ్చాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరిస్తూ ప్రజలకు గౌరవంగా సమాధానం చెప్పాలని తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను సానుకూలంగా విని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. తహశీల్దార్ పీర్‌మున్నీసా, కుమారస్వామి, ఆర్‌ఐ శేషం రాజు, గ్రామాల రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చమర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీర్ మున్నిసా

చంద్రకళను సత్కరిస్తున్న సర్పంచ్, సిబ్బంది

చంద్రకళ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ సహాయకురాలిగా పనిచేసిన చంద్రకళ సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ చంద్రగిరి పంచాయితీ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న చంద్రకళకు శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరరేగా సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఆమెను సత్కరించి ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లికార్జున రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఉదయ్, అబిద్, నాగరాచనాయక్, సచిన్ అనే కాలేషా, పరమేష్, కాలేష, శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి, తులసిరెడ్డి, యూనియన్ నాయకులు వెంకటరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ పిలుపునిచ్చారు. శనివారం అన్నమయ్య పార్క్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలోసంజీవ మాట్లాడుతూ సోమవారం 3 గంటలకు ఆర్‌అండ్‌బి బంగ్లా నుండి పాత బస్టాండ్ వరకు వందలాదిమందితో నిర్వహించే పాదయాత్రలో ఉద్యోగ సంఘ నాయకులు, ప్రతి ఒక్క దళిత నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య మాట్లాడుతూ మాలల ఉద్యోగ సంఘ నాయకులు, యువకులు పాదయాత్రకు తరలిరావాలన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అడుగుజాడల్లో అందరం నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోల్దొడ్డి మల్లిఖార్జున, ఉపాధ్యక్షులు ఎం.వి.రమణ, మాల మహానాడు గౌరవ అధ్యక్షులు జూరోపల్లి భాస్కర్, దళిత సీనియర్ నాయకులు ఎ.విశ్వనాథ్, జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు జల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

వెండి గద బహూకరణ

ప్రజాశక్తి - రాయచోటి : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి కర్ణాటక రాష్ట్రం, ధార్వాడ్ జిల్లాలోని ధార్వాడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ చాడిచాల్ 500 గ్రాముల వెండి గదను శనివారం బహు కరించారు. వీరికి ఆలయ అర్చకులు అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వి.రమణారెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఒకు గదను అందజేస్తున్న దాత ప్రవీణ్

7న ధర్నాను విజయవంతం చేయండి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథ రెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండి ఇలియాస్ బాష అధ్యక్షతన వివిఆర్ ఎస్‌టియు భవన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్‌సి మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి కానీ, చర్చించిన పరిస్థితి కానీ లేదన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందని వాపోయారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు చర్చించిన పరిస్థితి లేదన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖలో నాలుగు సంవత్సరాలుగా మూలుగుతుందన్నారు. విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, అంత్యక్రియల ఖర్చులు తదితర పెన్షన్ సౌలభ్యాలను కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ప్రతి సంవత్సరమూ రూ. 180 కోట్ల హెల్త్ కార్డుల అమలు కోసం చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డుపై వైద్యానికి ఏ హాస్పిటల్లో అంగీకరించడం లేదన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. వెంటనే ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యం, అర్బన్ ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. గురుకుల, ఆదర్శ,1998, 2008 డిఎస్‌సి, ఎంటిఎస్ టీచర్ల విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కెజిబివి ఉపాధ్యాయులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతన స్కేల్ కూడా అమలు చేయడం లేదన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ క్యాటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచకపోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులు పి.మహేష్ బాబు, కె.బాలగంగి రెడ్డి, నరసింహులు, షేక్. సాజిత్, బి.శివ శంకర్ రెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, జి.రామ మోహన్, ఎల్.గంగిరెడ్డి, సురేంద్ర నాయక్ పాల్గొన్నారు.

పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వరలక్ష్మి

మంగంపేటలో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో మంగంపేట యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను ముక్కా రూపానంరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ప్రారంభించారు. ఈ వాలీబాల్ పోటీలకు రూ.30వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ నేలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి మోడల్ స్కూ ల్‌లో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో రిషిత్, నితీష్, ప్రతాప్ అదేవిధంగా బాలికల విభాగంలో అఖిల, పుష్పలత, సుశాంతి, కార్తీక, తన్విక అనే విద్యార్థులు అక్టోబర్ 3నుంచి 5వ తేదీ వరకు వైజాగ్‌లో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

కేకు తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

ఘనంగా నిశ్చల్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్ర రోడ్డు రవాణా యోజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం లక్కిరెడ్డిపల్లి టిడిపి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మదన్ మోహన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫీనాయక్ కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ, జెకె జైచంద్రారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండూరు వెంకటరామరాజు, భాస్కర్‌రెడ్డి, జికెరెడ్డి, మల్లికార్జున, నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తక్కువుగా హాజరైన విద్యార్థులు

తంబళ్లపల్లిని వణికిస్తున్న జ్వరాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు విజృంబిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల వ్యాప్తి పెరగదింతో పిల్లలు, పెద్దలు ఎవరు చుసినా దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. చిన్నారులు సహా టీచర్లు, హెల్పర్లు జ్వరాల బారిన పడడంతో అంగన్వాడీ కేంద్రాలు పిల్లలు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి దోమల నివారణకు ఫాగింగ్, నీటికి క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దసరా సెలవులతో బస్సులు కిటకిట

ప్రజాశక్తి - వేంపల్లె

దసరా పండుగ సెలవులు సందర్భంగా ఆర్‌టిసి బస్సులు కిటకిటలాడుతున్నాయి. తమతమ సొంత ఊర్లకు వెళ్లడానికి ప్రజలు, విద్యార్థులు సిద్ధం కావడంతో ఆర్‌టిసి బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ట్రిపుల్‌ఐటికి దసరా సెలవులు ఇవ్వడంతో శనివారం విద్యార్థులు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచి చూశారు. ప్రతి బస్సు రద్దీగా వెళ్లుతుండడంతో బస్సుల కోసం ప్రజలు, విద్యార్థులు ఎదురుచూశారు. రద్దీతో పులివెందుల రోడ్డులో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. గతంలో ఇడుపులపాయ నుంచి ఆర్‌టిసి బస్సులను నేరుగా ఆయా ప్రాంతాలకు నడిపేవారు. ఇది ఆ విద్యార్థులకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం దసరా సెలవులకు ప్రత్యేక బస్సులు వేయకపోవడంతో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. మహిళలకు ఉచితం కావడంతో రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీని గమనించి పులివెందుల డిపో బస్సులను సర్వీస్‌లోకి పంపించి ఆయా ప్రాంతాలకు తిప్పుతున్నట్లు పులివెందుల డిఎం రామకృష్ణ తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

ప్రీ-ఆర్‌డి క్యాంప్‌నకు ఎంపికైన నవీన్

ప్రజాశక్తి - చాపాడు : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ బి.నవీన్ యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల తరపున ప్రీ-ఆర్‌డి క్యాంప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. నవీన్ బిఎస్‌సి మూడవ సంవత్సరం వృక్షశాస్త్రం చదువుతున్నాడు. నవీన్ నవంబర్ 1వ తేదీ నుండి 10 వరకు గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయంలో జరిగే ప్రత్యేక శిక్షణా శిబిరానికి హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభావంతులైన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పించడం విశేషమన్నారు. తమ కళాశాల విద్యార్థి ఈ విశిష్ట గౌరవం పొందడం గర్వకారణమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులు సేవాస్ఫూర్తిని అలవర్చుకొని, సమాజపట్ల బాధ్యతతో ముందుకు సాగాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థుల కృషి, పట్టుదల, అధ్యాపకుల ప్రోత్సాహ ఫలితమేనని అభినందించారు. విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రోడ్డు గుంతలమయం..ప్రయాణం నరకం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని దండువారిపల్లి నుంచి మల్‌రెడ్డిగారిపల్లికి వెళ్లె రోడ్డు గుంతలు మయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత కొంత కాలంగా ముళ్ల పొదలు సైతం పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక అవస్థలు పడుతున్నామని, వర్షం పడితే గుంతలు కనిపించక తీవ్ర ఇబ్బందులకు ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్అండ్‌బి ఆధ్వర్యంలో వేసిన రోడ్డు గత కొంత కాలానికే గుంతలు మారడంతో అధికారులు నాసిరకంగా రోడ్డు వేయించారని స్థానిక ప్రజలు భగ్గుమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు మయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయించి, ప్రమాదాల భారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.

గుంతలుగా మారిన మల్‌రెడ్డిగారిపల్లి రోడ్డు

సూపర్ జిఎస్‌టి సేవింగ్స్‌పై అవగాహన

కలకడ : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి-కలకడ

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపిడిఒ భాను ప్రసాద్ తెలిపారు.మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి దయాకంరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూపర్‌సెస్‌టి సూపర్ సేవింగ్స్ అనే అంశంపై అవగాహన కల్పించి నట్లు తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈనెల 25 నుంచి అక్టోబరు 19 వరకు అన్ని గ్రామ సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సవరించిన జిఎస్‌టి రేట్ల గురించి ప్రజలందరికీ కూడా అవగాహన కల్పించడం, సచివాలయ సిబ్బంది ద్వారా డోర్ టు డోర్ క్యాంపెయిన్ ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. ఆహార వస్తువులు, మందులు, రైతులకు సంబంధించి ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాలు ఇవన్నీ కూడా జిఎస్‌టి స్లాబ్‌లోకి తీసుకరావడం జరిగిందన్నారు. వీటిపైన ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యాపారస్తుల వద్ద పాత ఎంఆర్‌పి ప్రకారం వస్తువులు ఉన్న, ఒకవేళ ఆ వస్తువులు జిఎస్‌టిలో తగ్గుదల ఉంటే, అదే ధరకు వస్తువులను అమ్మకాలు చేపట్టగా పోతే 1915 టోల్ ఫ్రీకి సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. జిఎస్‌టిపై మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీలెఒ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో సర్పంచ్ మోహన్ రాజనాయుడు, జిఎస్‌టి అధికారి శివయ్య, బాలాజీ, ఎంఇఒ మునీంద్రనాయక్, డాక్టర్ మల్లికార్జున, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ ముబారక్‌అలీ,పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి :** సూపర్ జిఎస్‌టి -సూపర్ సేవింగ్స్ పథకంపై అవగాహన, చైతన్యం కలిగి ఆర్థికంగా డబ్బు ఆదా చేసుకుని ఆరోగ్యాంగా ఉందామని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. మండల కేంద్రం లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో నిర్వహిస్తున్న స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం లో హాజరైన మహిళలకు జిఎస్‌టి 2.0 వలన కలుగు ఆర్థిక ప్రయోజనం, కేన్సర్, జీవనసైలీ లో మార్పులు, టిబి వ్యాధి, పై అవగాహన కల్పించి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల జిఎస్‌టిని తగ్గించడం వల్ల సాదారణ పేద, మధ్య తరగతి, అందరికి ప్రయోజనం చేకూరడం జరిగిందన్నారు. ప్రజా ఆరోగ్యానికి దోహదం చేసే జిఎస్‌టి2.0 ప్రయోజనంలో లబ్ది పొంది పొదుపు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం స్వస్థ నారీ సశక్త పరివార్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ, శాంతకుమారి, పర్యవేక్షకులు గిరిజమ్మ, సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పిసి, హెచ్ఒలు పావని, నాగవేణి, ఎఎన్ఎం మాదవి, రెడ్డిబీ, ఆరోగ్య కార్యకర్తలు షఫీవుల్లా, జగన్మోహన్ అంగన్వాడీ టీచర్స్ అమ్మాజీ, ప్రసన్న, రెడ్డిరాని, తిరుమల, ఆశాకార్యకర్తలు ధనలక్ష్మి, రెడ్డెమ్మ, అరుణ, పుష్ప పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ కార్యాలయంలో మునిసిపల్ కమీషనర్ జి.వి.పల్లవి ఆధ్వర్యంలో శ సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిఎస్‌టిఒ శివప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జిఎస్‌టి 2.0పై అందరూ అవగాహన పెంచుకోవాలని వివిధ వస్తువులపై సవరించిన జిఎస్‌టి శాతాన్ని గమనించా లన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గంగాధర్,శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాబురెడ్డి నాయక్, సచివాలయం సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, సంఘమిత్రలు, కిరాణాషాప్ కమిటీ సభ్యులు, హార్డ్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** పంచాయతీల పురోగతిపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని ఎంపిడిఒ రెడ్డయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో పంచాయితీల పురోగతిపై సూచిక ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయితీ పురోగతిపై 27 శాఖలు గురించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. తొమ్మిది మంది టీం 27 శాఖల పై దృష్టి సారించి పురోగతిని అభివృద్ధి చేయాలన్నారు 2024-25 సంవత్సరాల సంబంధించిన అన్ని గ్రామాలు ఏ ప్లస్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, ఈఓపిఆర్డి ఉషారాణి, ఎస్ఐ రవీంద్ర ఎంఇఒ వెంకటసుబ్బయ్య, ఎపిఒ నిరంజన్ వ్యవసాయ అధికారి రాజకుమారి, మెడికల్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : మాట్లాడుతున్న ఎంపిడిఒ రెడ్డెయ్య

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

కలికిరి : త్రిపుర సుందరి అలంకారంలో ఎల్లమ్మ

ప్రజాశక్తి-నందలూరు

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ వరోజు శనివారం మీనాక్షి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకు మార్‌శర్మ, ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. ఉదయం ఉదయ దారులుగా బెల్లంకొండ హరీష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్,ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **కలికిరి:** కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ అమ్మవారు ఐదో రోజున లలిత త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో భాగంగా గ్రామదేవత ఎల్లమ్మ, సోమేశ్వర ఆలయాల్లో నవరాత్రి ఉత్స వాలు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రులను పురస్కరించుకొని కలికిరి ఎల్లమ్మ ఆలయం చైర్మన్ రెడ్డివారి అశోక్ రెడ్డి, సోమేశ్వర ఆలయం చైర్మన్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ రకాలైన పూలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. శరన్నవరాత్రులు ప్రారంభమైన సందర్భంగా అన్ని ఆలయాల్లో భక్తుల ప్రత్యేకంగా మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. **వాల్మీకిపురం:** మండలంలోని గండబోయనపల్లి కోటలో శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో ఆరవ రోజు శనివారం శ్రీ సత్యమ్మ తల్లి లలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారిని ఉదయం సుప్ర భాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు, అలంకరణలు నిర్వహించారు. అనం తరం భక్తులకు దర్శనం కల్పించడంతో భక్తులు అమ్మ వారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులి సత్య నారాయణ రెడ్డి, సద్దల చక్రపాణి, ప్రభాకర్‌రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రమేష్, చంద్రశేఖర్, చిన్న పరెడ్డి హరి, సర్పంచ్ గుర్రప్ప, పూజారి ఉత్తన్న,పాల్గొన్నారు.

వాల్మీకిపురం :లలితా త్రిపుర సుందరిగా సత్యమ్మతల్లి

రైతు సమస్యలపై ప్రస్తావన

ప్రజాశక్తి - చాపాడు

కెసి కెనాల్ రైతులు ఇరుకారు (రెండు పంటలు) ఆకాంక్షను నెరవేర్చాలని శనివారం శాసన సభలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రస్తావించారు. కెసి కాలువ కింద 92వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. కెసి కాలువకు అనుసంధానంగా అలగనూరు బాలన్సింగ్ రిజర్వాయర్ ఉందన్నారు. ఇందులో 2.965 టీఎంసీ నిలువ ఉంచుకునే అవకాశం ఉందన్నారు. అలగనూరు కట్ట తెగిపోయిందని, మరమ్మతులకు రూ.36కోట్లు అవసరమన్నారు. దీన్ని పూర్తి చేస్తే కెసి కాలువ ద్వారా రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. తద్వారా రైతులకు రూ.250 కోట్ల ఆదాయం సమాకూరుతుందని ఆయన వివరించారు. ఆ మేరకు నిధులు మంజూరు చేయాలని పుట్టా ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారు.

రేపు 'అల్లాడుపల్లె' చైర్మన్‌గా నారాయణ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - చాపాడు : మండలపరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్ర మాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని టిటిడి కల్యాణ మండపంలో ఏర్పాటు చేశా మన్నారు. ఆలయ చైర్మన్‌గా పెరుగు వీర నారాయణ యాదవ్, కమిటీ సభ్యులుగా ఆర్.వీరారెడ్డి, జిసిజి వీరారెడ్డి, పి.పార్వతి, కె.ఆదిలక్ష్మి, డి.పావని, పి.చెన్నమ్మ, వి.గుర్రమ్మ, వి.ఓం మహేశ్వర్‌రెడ్డి, బి.జగన్నాథరెడ్డి బాధ్యతలు చేపడతారని వివ రించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతారని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా పివి రమణ..

వేంపల్లె : స్థానిక వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా చింతలమడుగుపల్లెకు చెందిన పాలేగాళ్ళ వెంకటరమణ ప్రమాణ స్వీకార చేయనున్నారు. వషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు ఇటీవల పాలక మండలి సభ్యులను దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు నియమించారు. ఈమేరకు 29వ తేది సోమవారం ఉదయం 9 గంటలకు వషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన మైయిన్ బజార్ లో ఉన్న శ్రీవీరాంజనీయ స్వామి ఆలయంలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేపట్టనున్నారు. దేవస్థానం అధికారుల సమక్షంలో పాలక మండలి సభ్యులతో పాటు చైర్మన్‌గా పివి రమణ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారంకు పులివెందుల టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డితో పాటు టిడిపి నేతలు హాజరు కానున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం టిఫిన్ సౌకర్యం కూడ కల్పించినట్లు కాబోయే దేవస్థానం చైర్మన్ పివి రమణ చెప్పారు. పాలక మండలి ప్రమాణ స్వీకారానికి కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని కోరారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్వాతంత్ర సమరయోధుడు షాహిద్ భగత్ సింగ్ 118 జయంతి సందర్భంగా భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ ఆధ్వర్యంలో పొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ రూపానంద్, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చని వారు సూచించారు. రక్తదానం మరో ప్రాణాన్ని నిలబెడుతుందన్నారు. 40మంది రక్తదానం చేశారు. శిబిరంలో భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుర్రం డేవిడ్‌రాజ్, రామకృష్ణ, ప్రాల్గొన్నారు.

కార్మికుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో పారిశుధ్య కార్మికులు నివసిస్తున్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూ నియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. శనివారం చలో కడప కార్పొరేషన్ కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల నివాస ప్రాంతంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని పేర్కొ న్నారు. సమస్యలను పరిష్క రించాల్సిన అధికా రులు నిమ్మకు నీదేతినట్లు వ్యవహరించడం బాధా కరమని తెలిపారు. నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో కడప నగరపాలక సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు.

తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఎంపిడిఒ భానుప్రసాద్

తాగునీటి బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి- కలకడ

మరమ్మతుకు గురైన తాగునీటి బోర్లను మరమ్మతులు చేయించి తాగనీరు అందించినట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ గుడిబండ గ్రామంలో తాగునీటి బోర్లు మరమ్మతుకు గుర్రైనట్లు స్థానిక గ్రామస్తులు ఎంపిడిఒకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో గ్రామంలో నూతనంగా వేసిన బోరుకు మోటార్లు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. గ్రామంలో మరో రెండు బోర్లు మరమ్మతుకు గురి కావడంతో వాటిని మరమ్మతు చేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, జేఎల్ఎం వెంకటేశు పాల్గొన్నారు.

బాలుడి తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న దిన్నెమీద బలిజపల్లి సంఘం సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని దిన్నెమీద బలిజపల్లిలో నివాసమున్న బోనం సెట్టి నాగరాజ సుమలత కుమారుడు నాగచైతన్య అనే బాలుడు బోన్ బ్లడ్ కేన్సర్‌తో ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయం చేసి ఆదుకోవాలని బాలుడి తల్లిదండ్రులు పెద్దబలిజపల్లె సేవాసంఘం సభ్యులను కోరారు. సంఘం అధ్యక్షులు నంద్యాల నాగరాజ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరి సహకారంతో బాలుడు తండ్రి నాగరాజకు కువైట్‌లో సంఘం సభ్యులు చేతులమీదిగా రూ.1.14లక్షలు అందించారు. సాయం చేసిన వారిలో అలివేలి సుబ్బరాయుడు ,నంద్యాల రామాంజనేయులు, మన్యవరం తిరుమల, నందలూరు శివ, నంధ్యాల శిద్దయ్య ,బోసెట్టి ఇరగయ్య, బోసెట్టిహరీ, రామా రామాంజనేయులు, మంగాగారి చిన్నా, రవి, శివప్రసాద్ రాజు, పోకలవెంకటరమణ బాలక్రిష్ణ ,పోకల నాగేంద్ర, సంఘ సభ్యులు ఉన్నారు.

మహారాజ కేఫ్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మన్నూరు లోని పశు వైద్యశాల ఎదురుగా కోట ఆదినారాయణ నూతనంగా ఏర్పాటుచేసిన మహారాజ కేఫ్‌ను శనివారం మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. చేశారు. ఈ సందర్భంగా బత్యాల షాప్ యజమాని కోట తిరుపాల్ కుమారుడు కోట ఆదినారాయణను, కుటుంబసభ్యులను శాలువాతో సత్కరించి నాణ్యత ప్రమాణాలు పాటించి వినియోగదారుల మన్ననలు పొంది దిన దినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఫ్‌ను ప్రారంభిస్తున్న బత్యాల చెంగల్‌రాయుడు

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొండామర్రిపల్లి పంచాయతీ, తట్టివారిపల్లెకు చెందిన శేషయ్య కుమారుడు వి.నాగేంద్ర(37) కుటుంబ సమస్యలతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్త అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్యపై సల సలా కాలే సాంబారు పోసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తను శనివారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాజారెడ్డి కథనం మేరకు.. స్థానిక కురవంకకు చెందిన రామాంజులు భార్య భారతి ప్రభుత్వ ఆసుపత్రిలో డైట్ కాంట్రాక్టర్ ఉన్న వీరభద్ర వద్ద పనిచేస్తోంది. కాగా ఈనెల 24న సాయంత్రం భారతి స్థానిక జిల్లా ఆస్పత్రి వద్ద రోగులకు అన్నం వడ్డించేందుకు అన్నీ సిద్ధం చేసుకుంటుండగా రామాంజులు అక్కడికి వెళ్లాడు. భార్య తో గొడవ పెట్టుకుని, ఆవేశంతో కాలుతున్న సాంబారు భార్యపై పోసేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

టమోటా లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బోల్తా పడ్డ టమోటా ట్రాక్టర్

టమోటాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టమోటా క్రేట్లు రోడ్డుపక్కన ఆగి ఉన్న ఆటోపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కురబలకోట మండలం, ముదివేడు నుంచి శనివారం మదనపల్లె టమాటా మార్కెట్టుకు టమోటాలను తీసుకువస్తున్న ఓ ట్రాక్టర్ నీరుగట్టుపల్లె రింగ్ రోడ్డు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్లో లోడుతో ఉన్న క్రేట్లు రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటోపై పడ్డాయి. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్ కానీ, ప్రయాణీకులు ఎవరూ అందులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి ట్రాఫిక్ స్థంబించకుండా చర్యలు తీసుకున్నారు.